



## మధిరలో ఘనంగా కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు.

మధిర జూలై 4, వుదయం ప్రతినిధి: శ్రీ వాసవి ఆర్యవైశ కళ్యాణ మండపంలో కళ్యాణ మండప అధ్యక్షుడు కురువెళ్ల కృష్ణ ఆధ్వర్యంలో శనివారం నాడు మాజీ ముఖ్యమంత్రివర్యులు,కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.రోశయ్య చిత్రపటానికి పూలమాలలతో అలంకరించి నివాళులర్పించారు. శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండప అధ్యక్షుడు కురువెళ్ల కృష్ణ మాట్లాడుతూ రోశయ్య జీవిత చరిత్ర వారు చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండప ప్రధాన కార్యదర్శి నాళ్ళ శ్రీనివాసరావు ,వనమా వేణుగోపాలరావు,మాధవరపు నాగేశ్వరరావు,కొల్లా శ్రీనివాసరావు,కపిలవాయి జగన్మోహన్రావు,నేరెళ్ల శ్రీనివాసరావు,మహంకాళి శ్రీనివాసరావు, చెడే రామకోటేశ్వరరావు,భవిరి శెట్టి సాంబశివరావు,కొత్త మాన్ వెంకటేశ్వరరావు, పల్లపోతుల ప్రసాదు,పల్లపోతులగోపాలకృష్ణమూర్తి,తదితర ఆర్యవైశ్య పెద్దలు,కమిటీ సభ్యులు పాల్గొని రోశయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

## సూర్యాపేటలో పోలీసుల అర్ధరాత్రి సర్జికల్ చెకింగ్స్" హోటల్స్, లాడ్జీలలో ఆకస్మిక తనిఖీలు

ట్రాఫిక్ ఎస్సై సాయిరాం ఆధ్వర్యంలో నిఘా




సూర్యాపేట జూలై 4; వుదయం ప్రతినిధి శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సూర్యాపేట పోలీసులు అర్ధరాత్రి వేళ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన హోటల్స్, లాడ్జీలలో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తుల వివరాలను సేకరించి, గదులను పరిశీలించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై సాయిరాం మాట్లాడుతూ, ప్రజల భద్రత కోసం ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే లాడ్జీ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు."అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా 24/7 నిఘా కొనసాగుతుంది. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి" అని ఆయన ప్రజలకు సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలతో పట్టణంలో భద్రత మరింత పటిష్టమైందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## డ్రగ్స్ మాఫియాపై 'డాగ్ స్క్వాడ్' పంజా: చండూరులో ఖాకీల మెరుపుదాడి!



చండూరు, జూలై 4( వుదయం):
మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా చండూరు పట్టణంలో శనివారం పోలీసులు నార్కోటిక్ డ్రగ్స్ డాగ్ స్క్వాడ్తో కలిసి విస్తృత ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులే లక్ష్యంగా సాగుతున్న డ్రగ్స్ విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక సోదాలు చేపట్టారు. పట్టణంలోని ప్రధాన రద్దీ ప్రాంతాలతో పాటు పాఠశాలల సమీపంలోని కిరాణా దుకాణాలు, హోటళ్లు, స్థానిక బార్ అండ్ రెస్టారెంట్లలో స్నిఫర్ డాగ్స్ (శిక్షణ పొందిన కుక్కలు) సహాయంతో అణువణువూ గాలించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద ప్రాంతాలను, వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. యువతను నిర్వీర్యం చేస్తున్న మాదకద్రవ్యాల సరఫరా గొలుసును తెంచివేసేందుకు ఇటువంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించి డ్రగ్స్, గంజాయి వంటి నిషేధిత పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక ఏఎస్సై శ్రీరాములు, పోలీసు సిబ్బందితో పాటు గోపాల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తికి జిల్లా కలెక్టర్ అంకిత్ మర్యాదపూర్వక స్వాగతం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 4 (వుదయం ప్రతినిధి)
తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ జె. శ్రీనివాస్ రావు జిల్లా పర్యటనలో భాగంగా శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు విచ్చేశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ జె. శ్రీనివాస్ రావు జిల్లా పర్యటన కార్యక్రమాల్లో పాల్గొని సంబంధిత అంశాలపై అధికారులతో సమావేశమయ్యారు.
ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయవ్యవస్థకు చెందిన న్యాయాధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం

### సిఎం రేవంత్ రెడ్డి ఫోటోకి ఘనంగా పాలాభిషేకం



చర్ల, జూలై 4:(వుదయం ప్రతినిధి) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలో 20 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, మిఠాయిలు పంచి కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.
చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లంకరాజు, అరవింద్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, జెడ్పీటీసీ సభ్యునిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డి తన కృషి, పట్టుదల, ప్రజాసేవ పట్ల అంకితభావంతో రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడం ప్రతి రాజకీయ నాయకుడికి, కాంగ్రెస్ కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని అన్నారు. సాధారణ ప్రజాప్రతినిధిగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం నేడు తెలంగాణకు నాయకత్వం వహించే స్థాయికి చేరుకోవడం కష్టపడే ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు.
తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, పేదల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని, పారదర్శక పాలన, సామాజిక న్యాయం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని ఆయన అన్నారు.
టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళి మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం యువతకు ఆదర్శప్రాయమని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాండవ రాయుడు, నానిబాబు, వాసు,సీతాపతి రాజు, గాలిగోపి, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ప్రజాసేవా ప్రస్థానం మరిన్ని విజయాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.

## గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత" నారాయణపురంలో పల్లె దవాఖాన

కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రారంభించారు



సూర్యాపేట జిల్లా, జులై 4;వుదయం ప్రతినిధిగ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో భాగంగా, చిలుకూరు మండలం నారాయణపురం గ్రామంలో నేషనల్ హెల్త్ మిషన్ ు+మీా×ణజ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన నూతన పల్లె దవాఖాన భవనాన్ని కోదాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి శనివారం ఘనంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గతంలో చిన్న చిన్న అనారోగ్యాలకు కూడా ప్రజలు పట్టణ ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ప్రతి గ్రామంలో పల్లె దవాఖానల నిర్మాణంతో ఆ సమస్యకు పరిష్కారం లభించిందని అన్నారు.
నారాయణపురం పల్లె దవాఖానలో అన్ని రకాల ప్రాథమిక వైద్య సదుపాయాలు, మందులు అందుబాటులో ఉంటాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రత్యేక వైద్య సేవలు ఇక్కడే అందుతాయి. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి"అని ఎమ్మెల్యే ఆదేశించారు.అనంతరం దవాఖానలోని గదులు, మందుల గోదాం, రోగుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను ఎమ్మెల్యే పరిశీలించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ, నారాయణపురం గ్రామ అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నుండి త్వరలో నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న వారు
ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, వైద్యాధికారి డా. సుభాష్, ఏఎన్ఎం నాగలక్ష్మి, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.
నూతన దవాఖాన ప్రారంభంతో నారాయణపురంతో పాటు చుట్టుపక్కల 5 గ్రామాల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువయ్యాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



## తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

### : జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట జూలై 4;వుదయం ప్రతినిధితెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం, ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా కలెక్టరేట్లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెట్టిచాకిరీ, సామాజిక దోపిడీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన దొడ్డి కొమురయ్య తెలంగాణ ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన త్యాగాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.తెలంగాణ చరిత్రలో రైతాంగ సాయుధ పోరాటానికి దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం చిరస్థాయిగా నిలిచిపోతుందని, మహనీయుల ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్,జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్,
బీసీ వెల్ఫేర్ అధికారి విశాల్ ఉప్పల రమేష్ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి, కంచకట్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి, మన్యం యాదగిరి, దున్న శ్యామ్, జిల్లా కార్యదర్శి టీఎన్జీవోస్ యూనియన్,స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమరయ్య ఆశయ సాధనకై అంకితమవుదాం

### – బీసీ హక్కుల జిల్లా కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య.



చిలుకూరు జులై 04:( వుదయం ) తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య ఆశయ సాధనకై అంకిత మావదామని బీసీ హక్కుల సాధన సమితి సూర్యాపేట జిల్లా కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య అన్నారు,శనివారం నాడు సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో దొడ్డి కొమరయ్య 80 వర్ధంతి కార్యక్రమాలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.
తెలంగాణ సాయుధ పోరాటంలో తన ప్రాణాలు అర్పించిన తొలి అమరజీవి దొడ్డి కొమురయ్య అని ఆయన మరణం తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తి నిచ్చిందని ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ను గద్దె దించేందుకు నాలుగు వేల మంది నవ యువ కిశోరాలు ఆత్మ బలిదానంతో తెలంగాణకు విముక్తి జరిగి భారతదేశంలో విలీనం అయ్యిందని ఈనాడు మనమంత భారతీయుల మని సగర్వంగా చెప్పు చెప్పుకున్నామంటే అది సిపిఐ పార్టీ చేసిన అసమాన త్యాగాల పునాది అని ఆ మహనీయుడు త్యాగాల్ని గ్రామ గ్రామాన వివరించి నేడు పాలకులు అవలంబిస్తున్న తిరోగమన విధానాలను నేటి యువతరానికి వివరించి వారిని చైతన్యపరచి, మతోన్మాదుల కబంధ హస్తాల నుంచి భరతమాతను విముక్తి చేయాలని ఆయన కోరారు, నాటి స్వాతంత్ర పోరాటంలోనూ ఆ తర్వాత జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలోనూ అలాగే ఇటీవల జరిగిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ అశువులు బాసిన వారిలో బీసీలే ప్రథమ స్థానంలో ఉన్నారని త్యాగాలకు ప్రతీకైన బీసీలకు మాత్రం పాలకులు అభివృద్ధిలో తగువాటా ఇవ్వడం లేదని రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా బీసీల వెనకబాటు తనానికి పాలకులు అనుసరిస్తున్న విధానాలే కారణమని అందువల్ల బీసీలు చైతన్యమై న్యాయమైన హక్కుల కోసం బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జరిగే పోరాటాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు ఈ యొక్క కార్యక్రమంలో, రిటైర్డ్ కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకులు పుట్టపాక అంజయ్య . బీసీ హక్కుల సాధన సమితి గౌరవాఉపాధ్యక్షులు సిరాపురపు శ్రీనివాసరావు . సిపిఐ కార్యదర్శి చిలివేరు ఆంజనేయులు.మాజీ వార్డు సభ్యులు నారాయణ, తాడేపల్లి తిరుమల రావు, కొరట్ల సోమయ్య, దొడ్డ శీను, ఈగ శ్రీను, తదితరులు పాల్గొన్నారు,



## నూతన దంపతులను ఆశీర్వదించిన మున్సిపల్ వైస్ చైర్మన్ కోన ధనికుమార్.

మధిర, జూలై 4 వుదయం ప్రతినిధి: మధిర పట్టణంలో పబ్బతి సుబ్బారావు,దనలక్ష్మి వర్తక సంఘం కళ్యాణ మండపంలో తూములూరు ఉపేందర్ రావు,కమల కుమారి కుమార్తె తన్మయి,అఖిల్ వివాహ వేడుక ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా వరుడు అఖిల్ తో జరిగిన కళ్యాణ మహోత్సవానికి మధిర మున్సిపల్ వైస్ చైర్మన్ కోన ధనికుమార్ హాజరై వధూవరులనుఆశీర్వదించారు.వధూవరులుఆనందంగా,ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో నిండి ఆదర్శ దాంపత్య జీవితాన్ని గడపాలని ఆయన ఆకాంక్షించారు.అనంతరం వధూవరుల కుటుంబ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మిరియాల వెంకటరమణ గుప్తా,జిల్లా కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి రంగారావు,రంగా శ్రీనివాసరావు,జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి వనమా కిరణ్ కుమార్,శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం అధ్యక్షులు పల్లపోతు ప్రసాదరావు,మధిర రామాలయం అధ్యక్షులు వంగవీటి రాజశేఖర్,కోనానరసింహారావు,తూములూరు బాలు,వేముల నవీన్కుమార్, సిద్ధంశెట్టి సందీప్,వేముల మల్లికార్జునరావు,నేరెళ్ల శ్రీనివాసరావు హాజరై వధూవరులను దీవించారు.

## భరత్ విద్యాసంస్థలందు ఘనంగా బ్లూ డే సెలబ్రేషన్స్.



మధిర,జూలై 4,వుదయం ప్రతినిధి: భరత్ కిడ్స్ విభాగం నందు శనివారం బ్లూ డే సెలబ్రేషన్స్ లో పాఠశాల డైరెక్టర్ అండ్ కరస్పాండెంట్ విద్యాలత వెంకటరెడ్డి బ్లూ కలర్ గురించి వివరించడం జరిగింది. నీలం రంగు సాధారణంగా ప్రశాంతత,నమ్మకం, విశ్వసనీయత మరియు జ్ఞానానికి ప్రతిక.ఆకాశం మరియు సముద్రం యొక్క వికృతిని సూచిస్తుంది వివిధ సంస్కృతులలో నీలం రంగు దైవత్వం అధికారం మరియు స్థిరత్వాన్ని సూచిస్తుందని విద్యార్థులకు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జింకల కోటేశ్వరరావు,డీన్ రవీందర్ రెడ్డి,ప్రైమరీ ప్రిన్సిపాల్ ఉమా,ప్రైమరీ ఇంచార్జ్ స్రవంతి, ప్రీ ప్రైమరీ ప్రిన్సిపల్ ప్రియాంక ఉపాధ్యాయినీలు ప్రశాంతి, లావణ్య,శ్రీవల్లి,పూజిత పాల్గొన్నారు.

## అట్టహాసంగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

:పుల్లెంల కాంగ్రెస్ నాయకుల సందడి





చండూరు, జూలై 4 (వుదయం):
పేదల సొంతింటి కల నిజం కావడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. చండూరు మండలం పుల్లెంల గ్రామంలో శనివారం బొడ్డు హరికృష్ణ నూతనంగా నిర్మించుకున్న 'ఇందిరమ్మ ఇల్లు' గృహప్రవేశ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు పుల్లెంల గ్రామ కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన లబ్ధిదారుడు హరికృష్ణ దంపతులకు నాయకులు శాలువా కప్పి, ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటోందని హర్షం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం చూడటమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముక్కముల వెంకన్న, ఉప సర్పంచ్ చెడుబుద్ధి ఉషయ్య, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు వడ్డగోని చంద్రశేఖర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సీత యాదయ్య పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ మండల నాయకులు మందడి శంకర్ రెడ్డి, గండు వెంకట్ గౌడ్, వార్డు సభ్యులు భూతరాజు బాలరాజు, బద్దుల మల్లమ్మ పర్వతాలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు గండు కేశవులు, ఇరిగి వెంకన్న, సీత నర్సింహ్మ తదితరులు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

# గద్వాల ఎమ్మెల్యే ఇరవై ఏండ్ల రాజకీయం జీవిత ప్రస్థానం



- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ని సన్మానించిన
- మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు

**గద్వాల**
**జూలై 04 (వుదయం బ్యూరో)**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తాను గద్వాల మండల జడ్పిటిసిగా ఎన్నికై 20 ఏళ్లు ప్రస్థానం పూర్తయిన సందర్భంగా ప్రజా జీవితంలో కొనసాగుతూ రెండుసార్లు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా గద్వాల మండలం జడ్పిటిసి, ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్, మాజీ ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే కి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ కౌన్సిలర్ మురళి, సర్పంచ్ డి. ఆర్ విజయ్, నాయకులు మైలగడ్డ చంద్రశేఖర్, కురుమన్న, పూడూర్ చిన్నయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవే ధ్యేయం.. ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ నూతన అధ్యక్షుడు



**మునగాల**
**జులై 04 ( వుదయం):-**

మునగాల మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియామకమైన కాసర్ల కోటేశ్వరరావు శనివారం మండల పరిధిలోని బరాకతిగూడెం గ్రామంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే ఆలయ కమిటీ అధ్యక్షులు,ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్(బోస్ )జానకి రెడ్డి, బరకతి గూడెం గ్రామ అధ్యక్షులు సామెల్,దేవినేని రవి, మునగాల గ్రామ ఉప సర్పంచ్ కాసర్ల వెంకట్, పార్టీ అధికార ప్రతినిధి వేనేపల్లి వీరబాబు, యువ నాయకుడు రాజేష్, తదితరులు హాజరై కోటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ తరఫున నిరంతరం పనిచేస్తామని నాయకులు పేర్కొన్నారు.

# పేకాట రాయుళ్లు అరెస్టు

**దమ్మపేట**
**జూలై 4 (వుదయం ప్రతినిధి):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మ పేట మండల పరిధిలోని జమేదార్ బంజర గ్రామ శివారులోని పామాయిల్ తోటలో సాయంత్రం 5:20 గంటలకు ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారంతో... దమ్మపేట ఎస్సై , తమ సిబ్బందితో దాడి చేయగా.. ముగ్గురు వ్యక్తులు ., రెండు బైక్స్ & నగదు 4,300/రూపాయలను సీజ్ చేసి ., అనంతరం స్టేషన్ తీసుకువచ్చి కేసు నమోదు చేయడం జరిగింది

# సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులుగా వెలుగు వెంకన్న



**సూర్యాపేట**
**జులై 4: వుదయం ప్రతినిధి**

సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా వెలుగు వెంకన్న నియమితులైన సందర్భంగా జిల్లా సీనియర్ పాత్రికేయులు ఆయనను కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు తోట నరసయ్య, చల్లా చంద్రశేఖర్, పెద్దింటి శ్యాం సుందర్ రెడ్డి, అమరగాని నాగేందర్, ఐతగని రాంబాబు, బొజ్జ ఎడ్వర్డ్, తల్లాడ చందన్, శ్రీనివాస్, కంచర్ల సురేందర్* తదితరులు పాల్గొన్నారు.

# చర్లపల్లి చేనేత సహకార సంఘం ఎన్నికలు – నామినేషన్ల ప్రక్రియ ముగింపు



చర్లపల్లి చేనేత సహకార సంఘం ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శనివారం ముగిసింది. చివరి రోజున చైర్మన్ పదవికి రాపోలు భిక్షం (రంగయ్య) నామినేషన్ దాఖలు చేశారు. ఆయన ప్యానల్ తరఫున డైరెక్టర్ పదవులకు రాపోలు శ్రీనివాసులు, గంజి రమేష్, రాపోలు నరసింహ, రాపోలు యాదగిరి, గడ్డం సునీత, గజం జయసుధ, డబ్బుల భాస్కర్, రాపోలు విజయ్ తదితరులు తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.ఈ సందర్భంగా చైర్మన్ అభ్యర్థి రాపోలు భిక్షం మాట్లాడుతూ, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. చేనేత రంగ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని పేర్కొంటూ, తన ప్యానల్‌కు మద్దతు ఇచ్చి గెలిపించాలని సభ్యులను కోరారు. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో చర్లపల్లి చేనేత సహకార సంఘం ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. అభ్యర్థులు సభ్యులను కలిసి మద్దతు కూడగట్టే పనిలో నిమగ్నమయ్యారు.

# చేనేత సహకార సంఘాల ఎన్నికలు..ముగిసిన నామినేషన్ పర్వం

**గద్వాల**
**జూలై 04 (వుదయం బ్యూరో)**

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణంలోని నాలుగు, మల్దకల్ మండలంలోని ఒకటి కలిపి మొత్తం ఐదు చేనేత సహకార సంఘాల ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ పర్వం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. నామినేషన్ల సంఖ్యను పరిశీలిస్తే, గద్వాల హెచ్‌డబ్ల్యూసీఎస్ (పెద్ద చేనేత సహకార సంఘం)లో మాత్రమే హోరాహోరీ పోటీ నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి.హెచ్‌డబ్ల్యూసీఎస్‌లో మొత్తం 671 మంది సభ్యులు ఉండగా, 21 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో ఈ సంఘంలో ఎన్నికలు రాజకీయంగా ఆసక్తికరంగా మారనున్నాయని చేనేత కార్మికులు అభిప్రాయ పడుతున్నారు.ప్రియదర్శిని చేనేత మహిళా సహకార సంఘంలో 251 మంది సభ్యులు ఉండగా 9 మంది, రాజరాజేశ్వరి మిక్స్‌డ్ ఫ్యాబ్రిక్స్ చేనేత సహకార సంఘంలో 226 మంది సభ్యులకు గాను 10 మంది, శ్రీ రాఘవేంద్ర సిల్క్ ఉత్పత్తిదారుల సహకార సంఘంలో 158 మంది సభ్యులకు గాను 9 మంది నామినేషన్లు దాఖలు చేశారు.మల్దకల్ మండలం బూడిద పాడు గ్రామంలోని దివ్య హ్యాండ్లూమ్స్ చేనేత సహకార సంఘంలో 132 మంది సభ్యులు ఉండగా, 9 మంది మాత్రమే నామినేషన్లు వేశారు. నామినేషన్ల సంఖ్యను బట్టి గద్వాలలోని ప్రియదర్శిని, రాజరాజేశ్వరి, శ్రీ రాఘవేంద్ర సిల్క్ సహకార సంఘాలతో పాటు బూడిదిపాడులోని దివ్య హ్యాండ్లూమ్స్ సహకార సంఘంలో ఎన్నికలు ఏకగ్రీవమయ్యే అవకాశాలు ఉన్నాయని చేనేత కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, గద్వాల హెచ్‌డబ్ల్యూసీఎస్‌లో మాత్రం "నువ్వా-నేనా" అన్నట్లుగా హోరాహోరీ పోటీ నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయని వారు పేర్కొంటున్నారు.నామినేషన్ పత్రాల పరిశీలన, ఉపసంహరణ అనంతరం తుది అభ్యర్థుల జాబితా వెలువడనుండగా, చేనేత వర్గాల్లో ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది.

# ఎస్టిమేషన్‌కే పరిమితమైన కట్టు కాలువ మరమ్మత్తులు

- హామీలు గాలిలో కలిసినట్లే... పనులు మాత్రం ముందుకు కదలడం లేదు

**మునగాల జులై 04 ( వుదయం):**



మునగాల మండల కేంద్రంలోని లెఫ్ట్ కెనాల్ నుండి చెరువు వరకు ఉన్న కట్టు కాలువ విస్తరణ, మరమ్మత్తుల పనుల కోసం అధికారులు ఎస్టిమేషన్ రూపొందించి నెలలు గడుస్తున్నా నేటికీ పనులు ప్రారంభించకపోవడం స్థానిక ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. కాగితాలకే పరిమితమైన అభివృద్ధి పనులతో ప్రజలను మభ్యపెడుతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రాబోయే వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కాలువ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాలువ పూడికతో నిండి, కట్టలు బలహీనంగా మారినప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.గ్రామసభల వేదికగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గం గ్రామాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై అనేక హామీలు ఇచ్చినా వాటి అమలులో మాత్రం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటలు కేవలం ఓట్ల కోసమేనా అని ప్రశ్నిస్తున్నారు. వర్షాలు ప్రారంభమయ్యేలోపు పనులు చేపట్టకపోతే నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడి చెరువుకు నీటి చేరిక దెబ్బతినడంతో పాటు సమీప ప్రాంతాలు ముంపు సమస్యలను ఎదుర్కొనే పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఎస్టిమేషన్‌లకే పరిమితమైన పనులను వెంటనే ప్రారంభించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# చదువులో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**మునగాల,**
**జూలై 04 ( వుదయం):**



విద్యార్థులు కష్టపడి చదివి విద్యలో రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీసీ యువజన సంఘం జాతీయ కార్యదర్శి చందా సైదాబాబు అన్నారు. శనివారం గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగస్వామి కావాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అమరబోయిన మట్టయ్య యాదవ్, కొక్కిరేణి పీఏసీఎస్ చైర్మన్ చందా చంద్రయ్య, బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్, వార్డు సభ్యుడు, బీసీ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెవిరాల సీతారామయ్య, ప్రధానోపాధ్యాయులు నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రణబోతు శ్రీనివాసరెడ్డి, ఉపేందర్, వెంకట్ రెడ్డి, కె.వి. సార్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వర్షా కాల వ్యాధులపై డేవిడ్ రాజ్ హెచ్చరిక

**భద్రాచలం,**
**జూలై 04 (వుదయం ప్రతినిధి):**




వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గిరిజన ప్రాంతాల్లో మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు, చికున్‌గున్యా, అతిసారం, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఏమాత్రం నిర్లక్ష్యం చోటు చేసుకున్నా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవిడ్ రాజ్ స్పష్టం చేశారు.ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశాల మేరకు శనివారం భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రభుత్వ సబ్ యూనిట్ అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, పారామెడికల్ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో వర్షాకాలంలో చేపట్టాల్సిన ప్రత్యేక కార్యాచరణపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో డేవిడ్ రాజ్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో నివసించే ప్రజలకు వైద్య సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ప్రతి వైద్య ఉద్యోగి తప్పనిసరిగా తన హెడ్‌క్వార్టర్స్‌లోనే నివసించాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సిబ్బంది అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి రాకూడదన్నారు. ప్రజల ప్రాణాల కంటే ఏదీ ముఖ్యమైనది కాదని, ప్రతి ఉద్యోగి తన విధిని బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. గిరిజన గ్రామాల్లో చిన్నపాటి జ్వరాన్ని కూడా నిర్లక్ష్యం చేయరాదని, ప్రతి జ్వరాన్ని అనుమానాస్పద కేసుగా పరిగణించి వెంటనే రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించారు. మలేరియా లేదా డెంగీ కేసులు గుర్తించిన వెంటనే ప్రత్యేక వైద్య బృందాలను పంపించి ఆ గ్రామంలో వ్యాధి వ్యాప్తి చెందకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వర్షాల కారణంగా నిల్వ నీరు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో దోమల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉన్నందున గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలని, దోమల నివారణ కోసం ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రేయింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, నిల్వ నీటిని తొలగించడం వంటి చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు కలిసి ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించాలని, వారికి వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించాలని పేర్కొన్నారు.జిల్లా అదనపు వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి (గిరిజన) డాక్టర్ సైదులు మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తన పరిధిలోని గ్రామాలపై నిరంతర నిఘా ఉంచాలని అన్నారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే వాటిని పూర్తిగా నియంత్రించవచ్చని తెలిపారు.ఒక్క కేసు నమోదైనా వెంటనే ఫీవర్ సర్వే నిర్వహించి, కుటుంబ సభ్యులతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు కూడా పరీక్షలు నిర్వహించాలని సూచించారు.అలాగే గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించడం అత్యంత కీలకమని, నిల్వ నీటిని తొలగించడం, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమతెరలు ఉపయోగించడం, పూర్తిగా చేతులు కాళ్లు కప్పే దుస్తులు ధరించడం, జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడం వంటి అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు.ప్రతి పీహెచ్‌సీ పరిధిలో ఇటీవల ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలతో సమావేశాలు నిర్వహించి గ్రామాల పరిశుభ్రత, పారిశుద్ధ్య కార్యక్రమాలు, వ్యాధుల నియంత్రణ చర్యలపై సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖలన్నీ సమిష్టిగా పనిచేస్తేనే సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు.ప్రోగ్రామ్ ఆఫీసర్ (మలేరియా) డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని సబ్ యూనిట్ కార్యాలయాలకు అవసరమైన మలేరియా మందులు, ర్యాపిడ్ టెస్ట్ కిట్లు, మైక్రోస్కోప్ స్లైడ్లు, లార్విసైడ్లు, కెమికల్స్, బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్‌కు అవసరమైన సామగ్రిని పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎక్కడా మందుల కొరత లేకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.సమావేశంలో గ్రామాల వారీగా గత ఏడాది నమోదైన సీజనల్ వ్యాధుల వివరాలను సమీక్షించారు. ఎక్కువ కేసులు నమోదైన గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రతి వారం ఆరోగ్య సర్వేలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త తన పరిధిలోని గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి రోజువారీ నివేదికలను ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామ సభలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, యువజన సంఘాలు, మహిళా సంఘాల ద్వారా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రతి ఇంటికి వెళ్లి తాగునీటిని మరిగించి తాగడం, ఆహార పరిశుభ్రత పాటించడం, దోమల పెరుగుదలకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి సూచనలు అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వైద్య సేవల్లో నాణ్యత పెంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గిరిజన ప్రాంత ప్రజలకు అత్యవసర వైద్య సేవలు ఎలాంటి ఆటంకం లేకుండా అందేలా ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని డేవిడ్ రాజ్ పునరుద్ఘాటించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, విధుల్లో అలసత్వం ప్రదర్శించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని మరోసారి హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి గొంది వెంకటేశ్వర్లు, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ పాయం శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ యూనియన్ ప్రతినిధులు కృష్ణ, గోపి, ఎబినైజర్, సత్యనారాయణ, ప్రభుత్వ సబ్ యూనిట్ అధికారులు, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్–2026 పనులను పరిశీలించిన డిప్యూటీ సీఈఓ చెన్నయ్య

**గద్వాల జూలై 04 (వు దయం బ్యూరో)**



ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటైజేషన్‌ను వంద శాతం పూర్తి చేయాలని డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ చెన్నయ్య అధికారులను ఆదేశించారు.ఎస్ఐఆర్-2026 లో భాగంగా డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ శనివారం గద్వాల్ మున్సిపాలిటీ లోని జెమ్మిచేడు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి జాబితాలో నమోదు చేయడం అధికారుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీతో పాటు డిజిటైజేషన్‌ను కూడా వంద శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.డేటా నమోదు సమయంలో అత్యంత జాగ్రత్తతో వ్యవహరించి, ప్రతి వివరాన్ని కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఇంటింటి సర్వేను పూర్తిస్థాయిలో నిర్వహించి ఏఎస్‌డీ (ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్) జాబితాను క్షేత్రస్థాయి ధృవీకరణ ఆధారంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. గైర్హాజరైన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, మరణించిన వారి వివరాలను పూర్తి స్థాయి నిర్ధారణ అనంతరమే నమోదు చేయాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న డిజిటైజేషన్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతో పాటు, డేటా ఎంట్రీలో డూప్లికేట్ నమోదులు, అసంపూర్ణ వివరాలు లేదా ఇతర లోపాలకు ఆస్కారం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ శ్రీనివాస రావు, గద్వాల తహసీల్దార్ హరి కృష్ణ, జిల్లా ఎన్నికల విభాగం అధికారులు, జిల్లా ఐటీ సపోర్ట్ బృందం, బూత్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ముప్వా విజయ్‌బాబు అండతో రైతులపై అక్రమ కేసులు, భూదందా!

**దమ్మపేట**
**జూలై 4 (వుదయం ప్రతినిధి):**



రాష్ట్రంలో పారదర్శక పాలన నడుస్తోందని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అధికార పార్టీ నాయకుల భూదందాలు, దౌర్జన్యాలు పేద రైతుల ప్రాణాలు తీస్తున్నాయి. దమ్మపేట మండలం నల్లకుంట సర్వే నెంబర్ 273/1 లోని అసైన్డ్ భూములపై కన్నేసిన కొందరు పెద్దలు, అధికారులను గుప్పిట్లో పెట్టుకుని ఆడుతున్న కబ్జా నాటకం స్థానికంగా తీవ్ర సంచలనంగా మారింది. సాక్షాత్తూ రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ మువ్వ విజయ్ బాబు అండతోనే ఇక్కడ భారీ భూదందా నడుస్తోందని, న్యాయం అడిగితే తమపై అక్రమ కేసులు బనాయిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని బాధిత రైతులు శనివారం జరిగిన మీడియా సమావేశంలో కన్నీరుమున్నీరుగా విలపించారు.పోలీస్ స్టేషన్ కు భూమిస్తే.. అదే పోలీసులతో దౌర్జన్యాలా?గతంలో దమ్మపేట పోలీస్ స్టేషన్, నిర్మాణానికి తమ సొంత భూమిని ప్రభుత్వానికి దానం చేసిన మరియు.. నాడు ప్రభుత్వం భూమిలేని నిరుపేదలకు 1975లో ఈ అసైన్డ్ భూములను కొంత మంది రైతులకుకేటాయించింది. అప్పటినుండి వారు ఈ భూమిలోనే సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. రోజువారీ పూట గడవక, రోడ్డు పక్కన పప్పు సాంబార్ అమ్ముకుంటూ పొట్టపోసుకునే ఈ అభాగ్యుల భూములపై.. మాజీ ఐఏఎస్ అధికారి బి.దానం కుమారుడు, ప్రస్తుత ఏపీ (సంతనూతలపాడు) ఎమ్మెల్యే విజయ్ కన్ను పడింది.2010లోనే నాటి సబ్‌కలెక్టర్ పౌసమి బసు ఈ కబ్జాదారుల కాగితాలు చెల్లవని అప్పటి కలెక్టర్ ఉషారాణికి స్పష్టమైన నివేదిక ఇచ్చారు. అయినా సరే, ఏపీకి చెందిన ఆ ఎమ్మెల్యే కోసం ఇక్కడి తెలంగాణ ఐడీసీ ఛైర్మన్ మువ్వ విజయ్ బాబు తన రాజకీయ అధికారాన్ని అడ్డుపెట్టుకుని పేద రైతుల కడుపు కొడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. తోడల్లుడి కోసం అధికారులపై ఒత్తిడి నిర్వీర్యమైన యంత్రాంగం:ఈ భారీ భూదందాలో మువ్వ విజయ్ బాబు తన తోడల్లుడు 'ఉడతనేని మధుసూదన్ రావు'ను ముందుపెట్టి చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీ పెద్దల అండ ఉండటంతో స్థానిక పోలీసు, రెవెన్యూ యంత్రాంగం పూర్తిగా కీలుబొమ్మలుగా మారిపోయాయి. హైకోర్టు (W.P. No. 31912 of 2025) స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా సరే, వాటిని బేఖాతరు చేస్తూ మువ్వ విజయ్ బాబు తోడల్లుడు మధుసూదన్ రావును పోలీసులు వెంటేసుకుని రావడం.. పోలీస్ స్టేషన్లలో రైతులపైనే ఫిర్యాదులు చేయించి వారిని స్టేషన్ల చుట్టూ తిప్పడం రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలకు అద్దం పడుతోంది. అధికారుల తీరుపై రైతులు లాయర్ ద్వారా 'కోర్టు ధిక్కరణ' నోటీసులు ఇచ్చారనే కక్షతో.. సాగులో ఉన్న రైతులపైనే జూలై 2న పోలీసులు హడావుడిగా క్రిమినల్ కేసులు బనాయించడం పాలకుల పక్షపాత వైఖరిని బట్టబయలు చేస్తోంది. గుండె ఆగి చనిపోతున్నా.. కరగని ప్రభుత్వ పెద్దల మనసులు ఈ భూపోరాటంలో నాయకుల వేధింపులు, అధికారుల బెదిరింపులు తట్టుకోలేక, తమ జీవనాధారం పోతుందనే ఆవేదనతో గుండెపోటుకు గురై రైతులు ప్రాణాలు వదులుతున్నా ప్రభుత్వ పెద్దల రాతి మనసులు కరగడం లేదు. కబ్జాదారులకు ఒక న్యాయం, పేదలకు ఒక న్యాయమా? అని రైతులు ప్రభుత్వాన్ని సూటిగా నిలదీస్తున్నారు.
"మా ప్రాణాలు పోయినా సరే ఈ మట్టిని వదలం. ఈ మాఫియా నుండి మమ్మల్ని కాపాడాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వం పైనే ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వెంటనే స్పందించి, నాయకుల అండతో నడుస్తున్న ఈ భూదందాను అడ్డుకోవాలి. మాపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి" అని జంగాల వెంకటేశ్వరరావు, మళ్ళా వెంకటేశ్వరరావు, మళ్ళా కమల, బొగ్గం శివ, బొగ్గం రాజు, గోళ్ళ భవాని కృష్ణ, గట్ల సర్వేశ్వరరావు తదితర బాధిత రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో కాంగ్రెస్ నేతల చురుకైన భాగస్వామ్యం

- 144వ పోలింగ్ బూత్ పరిధిలో ఇంటింటికీ ఫారాల పంపిణీ – అర్హులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి

**భద్రాచలం,**
**జూలై 4 (వుదయం ప్రతినిధి):**



భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో వేగవంతంగా కొనసాగుతోంది. ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం అత్యంత అవసరమనే ఉద్దేశంతో అధికారులు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో భద్రాచలం పట్టణంలోని 144వ పోలింగ్ బూత్ పరిధిలో బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక సవరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 144వ బూత్ బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్ఏ), నాలుగో వార్డు ఇన్‌చార్జి రేపాక సాయి అఖిల్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. కొత్త ఓటర్ల నమోదు, పేర్లలో సవరణలు, చిరునామా మార్పులు, పోలింగ్ కేంద్ర మార్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు, డూప్లికేట్ నమోదుల తొలగింపు వంటి అంశాలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను ప్రజలకు పంపిణీ చేశారు. అలాగే వాటిని ఎలా నింపాలి, ఏ పత్రాలు జతచేయాలి, ఎక్కడ సమర్పించాలి అనే వివరాలను కూడా ఓటర్లకు వివరించారు. ఈ సందర్భంగా రేపాక సాయి అఖిల్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు మూలస్తంభమని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ముందుగా ఓటరు జాబితాలో తన పేరు సక్రమంగా ఉండాలని అన్నారు. ఇటీవల 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న యువతీ యువకులు తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే వివాహం కారణంగా పేరు లేదా చిరునామా మారిన మహిళలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన వారు, ఇప్పటివరకు పేరు నమోదు చేయించుకోని అర్హులందరూ ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో చిన్న చిన్న పొరపాట్లు కూడా ఎన్నికల సమయంలో ఇబ్బందులకు దారితీసే అవకాశం ఉందని ఆయన అన్నారు. పేరు, వయస్సు, చిరునామా, కుటుంబ వివరాలు వంటి అంశాలను ఒకసారి పరిశీలించి అవసరమైతే వెంటనే సవరణలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. బీఎల్ఓ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల ఫారాలను అందజేస్తూ, సందేహాలను నివృత్తి చేస్తున్నామని చెప్పారు. కొత్తగా ఓటు హక్కు పొందే యువతకు నమోదు ప్రక్రియపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నామని, అవసరమైన ధ్రువపత్రాలపై కూడా వివరాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రత్యేక సవరణ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాను పూర్తిస్థాయిలో తప్పులులేని విధంగా రూపొందించడమే ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో ఖచ్చితత్వం, పారదర్శకత, ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడంలో ఈ ప్రక్రియ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఓటు హక్కు విలువను వివరిస్తూ, ఎన్నికల్లో పాల్గొనడం కేవలం హక్కు మాత్రమే కాకుండా బాధ్యత కూడా అని తెలియజేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి ఓటు కీలకమని, అందుకే ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎల్ఓ ప్రేమ్ కుమార్, ఎన్నికల సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. వారు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఫారాలు పంపిణీ చేయడంతో పాటు ప్రత్యేక సవరణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పూర్తయ్యేలోపు ప్రజలు తమ వివరాలను తప్పనిసరిగా పరిశీలించి, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం సంబంధిత ఫారాలను సమర్పించాలని అధికారులు మరోసారి విజ్ఞప్తి చేశారు. ప్రజల చైతన్యం, సహకారంతోనే ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందుతుందని, అదే ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# దొడ్డి కొమరయ్య త్యాగస్ఫూర్తి చిరస్మరణీయం: మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి



నల్గొండ: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నిర్మూలన కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య త్యాగస్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శమని నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అన్నారు. దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నల్లగొండ-హైదరాబాద్ రోడ్డులోని ఆయన విగ్రహానికి మేయర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దున్నే వాడికే భూమి" అనే నినాదంతో సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 1946 జూలై 4న జనగామ జిల్లా కడవెండి గ్రామంలో భూస్వాముల కాల్పుల్లో దొడ్డి కొమరయ్య తొలి అమరుడిగా నిలిచారని గుర్తు చేశారు. దొడ్డి కొమరయ్య అమరత్వం తెలంగాణ రైతాంగ పోరాటానికి కొత్త ఊపునిచ్చిందని, ఆ పోరాట ఫలితంగా భూస్వామ్య వ్యవస్థకు ఎదురుదెబ్బ తగిలి వేలాది ఎకరాల భూమి పేదలకు పంపిణీ కావడంతో పాటు అనేక గ్రామాలు ప్రజారాజ్యాలుగా రూపుదిద్దుకున్నాయని పేర్కొన్నారు. ఈ చారిత్రక పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వారి పోరాట స్ఫూర్తిని భావి తరాలకు తెలియజేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని మేయర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లి సుభాష్ యాదవ్, పిల్లి రామరాజు యాదవ్, లొడంగి గోవర్ధన్ యాదవ్, చీర పంకజ్ యాదవ్, ఎడ్ల శ్రీను యాదవ్, సోమన్న, బోయిన సుధాకర్ యాదవ్, పర్వతాలు యాదవ్, తేలు అన్న రవి యాదవ్, మామిడి పద్మతో పాటు యాదవ సంఘం నాయకులు పాల్గొని దొడ్డి కొమరయ్య విగ్రహానికి నివాళులర్పించారు.

# మధిరలో ఘనంగా వంగవీటి రంగా జయంతి వేడుకలు



**మధిర జూలై 4 వుదయం ప్రతినిధి:** ప్రజా నాయకుడు మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్ రంగా 79వ జయంతి వేడుకలు శనివారం నాడు మధిర మున్నూరు కాపు నియోజకవర్గ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినారు.ముందుగా రంగా చిత్రపటానికి నియోజకవర్గ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు అనంతరం నియోజకవర్గ అధ్యక్షులు ఆళ్ళ కృష్ణ మాట్లాడుతూ రంగా బడుగు బలహీన వర్గాల కోసం చేసిన పోరాటం సేవలు చిరస్మరణీయమనికొనియాడారు రంగా ఆశయాలు స్ఫూర్తిగా తీసుకొని సమాజసేవలో ముందుకు సాగుతామని నాయకులు ప్రతిజ్ఞ చేశారు వంగవీటి మోహన్ రంగ 1947 జులై 4 విజయవాడలో జన్మించారు.బడుగు బలహీన వర్గాల కోసం అలుపెరగని పోరాటం చేసినప్రజానాయకుడు ఆయన విద్యార్థి దేశనుండే రాజకీయాల్లోకి వచ్చి అనగారిన వర్గాల హక్కుల కోసం కొనియాడా రంగా అంటేనే సామాజిక న్యాయానికి మారుపేరు అయ్యింది కృష్ణాజిల్లా విజయవాడ తూర్పు నియోజకవర్గం నుండి 1983లో ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల కోసం వెంటనే స్పందించి నాయుడుగా పేరు తెచ్చుకున్నారు ఈ కార్యక్రమంలో మధిర నియోజకవర్గం ఆళ్ళ కృష్ణ, టౌన్ అధ్యక్షుడు నీలం వెంకటేశ్వర్లు,మండల సెక్రెటరీ పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు, టౌన్ సెక్రెటరీ కృష్ణ, రంగశెట్టి కోటేశ్వరరావు ,ఆళ్ళ శంకర్రావు, దనిశెట్టి భాస్కరరావు, కొఠారి రాఘవ, వీరంశెట్టి సీతారామయ్య, గూడెల్లి కిరణ్ ,ఎకిటీల కృష్ణారావు కంచర్ల రమణ వీరంశెట్టి, కాళేశ్వరరావు వీరా సంపత్ కుమార్ ,కోలా కొండలరావు, జున్ను సుదర్శన్, తోట సాయి ,బుర్ర శ్రీనివాసరావు, కామిశెట్టి శ్రీను, లంకె మల్ల నాగేశ్వరరావు, గుర్రం సుబ్బారావు, చింతల నాగేశ్వరరావు ,చిన్న వెంకటేశ్వర్లు, గుర్రం సురేష్, 19వ వార్డ్ కౌన్సిలర్ యన్న శెట్టి అప్పారావు, 8వ కౌన్సిలర్ యన్నం కోటేశ్వరరావు, సిధా కృష్ణ, చెన్నం స్వామి, ఇల్లూర్ నవీన్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ధర్మసాగర్ కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షుడు పెసరు రమేష్.



**ధర్మసాగర్ జూలై 04 (వుదయం ప్రతినిధి)**

ఈ రోజు ధర్మసాగర్ మండలం ధర్మసాగర్ గ్రామం లోని సుస్మిత గార్డెన్లో ధర్మసాగర్ మండల నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెసరు రమేష్ మాట్లాడుతూ, మొదటగా నాకు ఈ అధ్యక్ష పదవినిచ్చిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.ధర్మసాగర్ మండలంలో ఏ కార్యకర్తకు ఏ సమస్య వచ్చిన, నా దృష్టికి తీసుకు వస్తే ప్రస్తుత ఎమ్మెల్యే అయినటువంటి కడియం శ్రీహరి సహకారంతో నేను పరిష్కరిస్తానని ఈ సభాముఖంగా తెలియజేస్తున్నాను. అనంతరం మాజీ మండల అధ్యక్షుడు గుర్రం ప్రసాద్ శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ సర్పంచి మాచర్ల జ్యోతి ఏలియా శాలువతో సత్కరించారు. ఇతర గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు కూడా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఆరుగురు నిందితుల అరెస్ట్

**- ఎస్సై తమాషా రెడ్డి**

**మహాదేవపూర్ జులై 04(వుదయం ప్రతినిధి)**


కాళేశ్వరం గ్రామంలోని టెంట్ సిటీలోని 8 ఏసీ దొంగతనం చేసిన ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు కాళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో గత సంవత్సరం నిర్వహించిన సరస్వతీ పుష్కరాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన టెంట్ సిటీలోని 8 ఏసీ ఔటర్ యూనిట్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసిన సంఘటనకు సంబంధించి టెంట్ సిటీ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందని తెలిపారు దర్యాప్తులో లభించిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా కాళేశ్వరం గ్రామానికి చెందిన అనుమానితులు మహేందర్, నారాయణ, జావేద్, సమ్మయ్య, సృజన్ తోపాటు సాయిలను అదుపులోకి తీసుకొని విచారించగా, వారు టెంట్ సిటీలోని 8 ఏసీ ఔటర్ యూనిట్లను దొంగిలించినట్లు అంగీకరించారు అని వెల్లడించారు తదుపరి విచారణలో, దొంగిలించిన ఏసీ ఔటర్ యూనిట్లను గుర్తు తెలియని వ్యక్తికి విక్రయించి పొందిన రూ.1,50,000/ నగదును నిందితుల వద్ద నుండి స్వాధీనం చేసుకోవడం జరిగిందని అన్నారు ఈ కేసులో మొత్తం ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి, చట్టపరమైన చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు, మరోవైపు ఈ కేసును ఛేదించి నిందితులను గుర్తించి అరెస్ట్ చేయడంలో కృషి చేసిన ఎస్సై తమాషా రెడ్డి తోపాటు సిబ్బందిని పై అధికారులు అభినందించారు.

# న్యూ శాయంపేటలో అధికారుల విస్తృత పర్యటన

**– ఓటర్ల జాబితా పారదర్శకతకు ప్రాధాన్యం**

**హనుమకొండ టౌన్, జూలై 04 (వుదయం ప్రతినిధి) :**

ఓటర్ల జాబితాను సంపూర్ణంగా, తప్పుల్లేకుండా రూపొందించడమే లక్ష్యంగా చేపట్టిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) ప్రక్రియను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 31వ డివిజన్ న్యూ శాయంపేటలో రాష్ట్ర అదనపు సీఈఓ డా. వెంకటేశ్వర రెడ్డి, హన్మకొండ ఆర్డీఓ వెంకటేష్, కాజీపేట తహసీల్దార్ సిహెచ్. రాజు, అడిషనల్ తహసీల్దార్ రమేష్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డిలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఓటర్ల వివరాల సవరణ, కొత్త పేర్ల నమోదు, ధృవీకరణ పనులను ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పూర్తి చేసి నిర్ణీత గడువులోపు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శివ, డివిజన్ సూపర్‌వైజర్ సుదర్శన్, డీసీసీ కార్యవర్గ సభ్యులు మామిండ్ల సురేష్, బీఎల్ఓలు, బీఎల్ఏలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# ఇంటర్ ప్రథమ సంవత్సరం స్పాట్ అడ్మిషన్లకు అవకాశం – జూలై 6న జిల్లా కేంద్రాల్లో కౌన్సెలింగ్

నల్గొండ: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (TGSWREIS) ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం జూలై 6న జిల్లా కేంద్రాల్లో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీసీఓ శోభారాణి తెలిపారు. ఆర్‌జేసీసీఈటీ-2026 (RJCCET2026) ద్వారా ఇప్పటికే రెండు విడతల్లో ప్రవేశాలు పూర్తయ్యాయని, అయినప్పటికీ కొన్ని కళాశాలల్లో సీట్లు ఖాళీగా ఉండటంతో వాటిని భర్తీ చేసేందుకు జిల్లా స్థాయిలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన విద్యార్థులు సంబంధిత జిల్లా కేంద్రాల్లో నిర్వహించే స్పాట్ కౌన్సెలింగ్‌కు అవసరమైన ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు వాటి రెండు జిరాక్స్ సెట్లను తీసుకురావాలని సూచించారు. స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా మిగిలిన అన్ని ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్ కేంద్రాలు బాలురకు: TGSWRS జూనియర్ కళాశాల, అనుముల (పోప్ పాల్ జూనియర్ కళాశాల ప్రాంగణం) బత్తాయి మార్కెట్ ఎదురుగా, ఎస్ఎల్‌బీసీ - సాగర్ రోడ్, నల్గొండ. బాలికలకు:తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల, నిడమనూరు (SRTS, సాగర్ రోడ్, నల్గొండ).అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్య.. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 4 (వుదయం ప్రతినిధి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంపూర్ మిలీనియం కాలనీకి చెందిన చంద్రమోహన్ సింగరేణి సెక్యూరిటీ గార్డు ఈ నెల 2వ తేదీ సాయంత్రం తన పల్సర్ మోటార్‌సైకిల్ TS28G6393 పై ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు గాలింపు చేపట్టారు. ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం రామవరం వనం దాస్‌గడ్డకు చెందిన భాగ్యలక్ష్మి నివాసంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని చంద్రమోహన్ మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భాగ్యలక్ష్మితో వివాహేతర సంబంధం ఉన్నట్లు ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటన అనంతరం భాగ్యలక్ష్మి పరారీలో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కొత్తగూడెం టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును ఎస్ఐ కె. రాజశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు.

# రాజంపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**కామారెడ్డి, జూలై 4 (వుదయం ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా పోలీసు అధికారియం. రాజేష్ చంద్ర రాజంపేట పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణ, రిసెప్షన్, వివిధ కేసులకు సంబంధించిన రికార్డులు, సీసీ టీఎన్ఎస్ అప్‌లోడ్, అప్‌డేషన్, కేసు ఫైళ్ల నిర్వహణ, స్టోర్‌రూమ్, బెల్ ఆఫ్ ఆర్మ్స్ తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, డ్యూటీ రోస్టర్‌ను సమీక్షించి, అందుబాటులో ఉన్న సిబ్బందిని సమర్థవంతంగా వినియోగిస్తూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందేలా విధులను ప్రణాళికాబద్ధంగా కేటాయించాలని సూచించారు.అనంతరం సంబంధిత అధికారులకు పలు సూచనలు చేస్తూ, కేసులకు సంబంధించిన ఫైళ్లను క్రమబద్ధంగా నిర్వహించాలని, స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ భద్రపరచాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ లో నమోదయ్యే కేసులు, దర్యాప్తు వివరాలు, ఇతర సమాచారాన్ని ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో అప్‌లోడ్ చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను ఓర్పుతో విని, చట్టపరంగా సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా పోలీస్ స్టేషన్ పని తీరులో పూర్తి పారదర్శకత పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని, పరిశుభ్రత, క్రమశిక్షణ, రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పని చేస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా ప్రజాసేవా దృక్పథంతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# వర్షా కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి





**- అంటు వ్యాధుల ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి :: మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్**

**మహబూబాబాద్, జూలై.04. వుదయం జిల్లా ప్రతినిధి**

శనివారం మహబూబాబాద్ పట్టణంలోని స్థానిక శాసనసభ్యుల క్యాంప్ కార్యాలయంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ అధ్యక్షతన నియోజకవర్గ పరిధిలోగల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల వైద్యాధికారులకు, వైద్య సిబ్బందితో వర్షాకాలంలో సంభవించే వ్యాధులపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు కుట్టకుండా పుట్టకుండా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలపై ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, మలేరియా, డెంగ్యూ లాంటి జ్వరాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ, గర్భిణీ స్త్రీలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, నమోదు కాగానే ఐరన్ ఫోలిక్ మాత్రలతో పాటు వ్యాక్సినేషన్ ఇవ్వాలని, గర్భిణీ స్త్రీల చెకప్‌లతోపాటు, రక్తహీనత గల ప్రమాదకర గర్భిణీ స్త్రీలను గుర్తించి రికార్డు చేసుకొని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించాలని మరియు ఎక్స్పెక్టెడ్ డెలివరీ డేట్ నమోదు చేసుకొని, సాధారణ ప్రసవాలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో గవర్నమెంట్ హాస్పిటల్ ప్రోత్సహించాలని మరియు అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా నియోజకవర్గ పరిధిలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర వైద్యాధికారులకు, ఏఎన్ఎంలకు, సూపర్వైజర్లకు సూచన సలహాలు అందించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, మెడికల్ అడ్వైజరీ బోర్డు మెంబర్స్ భీమవరం ప్రకాష్ రెడ్డి, మధుర బోయిన యాకయ్య, ఉమా పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ఆర్ట్ పోటీలో మెడల్ సాధించిన సంపేట సాకేత్




**వరంగల్ టౌన్, జూలై 04 (వుదయం ప్రతినిధి) :**

వరంగల్ లోని ఎస్ఆర్ ప్రైమ్ కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్, బట్టు పల్లిలో 8వ తరగతి చదువుతున్న సంపేట సాకేత్ అంతర్జాతీయ స్థాయి రంగోత్సవ్ సెలబ్రేషన్ నిర్వహించిన కలరింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి B+ గ్రేడ్‌తో సర్టిఫికేట్ ఆఫ్ అచీవ్‌మెంట్ అందుకున్నాడు.

అతని ప్రతిభను గుర్తించిన రంగోత్సవ్ సెలబ్రేషన్ సంస్థ, సాకేత్‌ను జాతీయ మరియు అంతర్జాతీయ ఆర్ట్ పోటీలలో మెడల్ సాధించిన సందర్భంగా అభినందన లేఖ ద్వారా తెలిపింది. సాకేత్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు సాకేత్‌ను అభినందిస్తూ, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ఎస్ ఐ ఆర్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



**- కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ.**

**చిలుకూరు జూలై04:( వుదయం )**

ఓటర్ ఇంటి వద్దనే ఆన్ లైన్ చేయాలి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ను బీఎల్ఎలు ఏలాంటి తప్పులులేకుండా ఓటర్ ఇంటి వద్ద నే ఆన్ లైన్ చేయాలని. కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరుగుతున్న సర్ సర్వేను ఆయన ఫీల్డ్ లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఎల్ ఓలు శిక్షణలో నేర్చుకున్న విషయాలను పూర్తి స్థాయిలో అవగాహన చేసుకొని సర్వేను ఏలాంటి తప్పులు లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు వచ్చేలా చూడాలని అన్నారు. ఎన్యూమరేషన్ ఫారమ్స్ పంపిణీ వెంటనే పూర్తి చేసి, యాప్ లో అప్లోడ్ చేయాలని అన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ ధృవకుమార్, మాస్టర్ ట్రైనర్ చందా శ్రీనివాస్,ఆర్ ఐ లు మంత్రిప్రగడ సీతరామచంద్రావు, శ్వేత బి ఎల్ ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



**చిలుకూరు జూలై 04:( వుదయం )**

మండల కేంద్రంలోని పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, శ నివారం మండల నికి చెందిన బలుసుపాటి ఆదెమ్మ అనారోగ్యంతో మరణించారని తెలిసి వారి మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి ప్రగాఢ సానుభూతి తెలియపరిచి వారి కుటుంబ సభ్యులను పరామర్శించినారు అనంతరం చిలుకూరు మండలం మాధవగుడెం గ్రామ నివాసి బుడిగాం వీర భద్రయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసి వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో, సోసైటి చైర్మన్ అలస కాని జనార్దన్,బెల్లంకొండ నాగయ్య, వార్డు మెంబర్ షాకిర్, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోదాడలో 352 మందికి రూ.1.24 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు



**కోదాడ, జూలై 4(వుదయం)**

కోదాడ నియోజకవర్గంలోని 352 మంది లబ్ధిదారులకు రూ.1,24,08,500 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి శనివారం క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అనారోగ్యం వంటి అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా నిలుస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు.

మండలాల వారీగా అనంతగిరి-58, చిలుకూరు-48, కోదాడ రూరల్-38, కోదాడ టౌన్-50, మోతే-59, నడిగూడెం-49 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1.24 కోట్ల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్లు గుడిసె నివాస లబ్ధిదారులను ఎంపిక లో ప్రాధాన్యత



**పర్వతగిరి ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్**

**పర్వతగిరి , జులై 4 ( వుదయం ప్రతినిధి ) :**

పర్వతగిరి మండల కేంద్రంలో ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ శనివారం పర్వతగిరి గ్రామపంచాయతీ లో రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు లో గ్రామంలో పర్యటిస్తూ మొదట గుడిసె లో నివసిస్తున్న లబ్ధిదారులను ఎంపిక చేయటం జరుగుతుందని

తెలిపారు. త్వరలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయటంకు.. లబ్ధిదారులు ఎంపిక చేసి ప్రభుత్వం నిబంధనలు పాటించి ప్రభుత్వం నకు మంజూరు పంపిస్తామని ఎంపీడీఓ శంకర్ నాయక్ తెలిపినారు. ఈ కార్యక్రమం లో.. పంచాయతి కార్యదర్శి రఘు పంచాయతి సిబ్బంది పాలుగోన్నారు

# ఇంటర్మీడియట్ లో 980 మార్కులు సాధించిన కల్లెడవిద్యార్థిధర్మిని.రి ద్వీక




**పర్వతగిరి, జులై 4 ( వుదయం ప్రతినిధి ) :**

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడకు చెందిన ధర్మిని శ్రీనివాస్ కరుణ దంపతుల కుమార్తె ధర్మిని రిద్వి ఇంటర్మీడియట్లో 980 మార్కులు సాధించింది. శనివారం రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రోశయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య 93వ జయంతి సందర్భంగా రాష్ట్రంలో 200 మంది మెరిట్ కలిగిన పేద విద్యార్థులకు స్టైఫండ్, గోల్డ్ ఇందులో భాగంగా ధర్మిని రిద్వికకు కూడా అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ విద్యా కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ రాజధానిలో మీడియా సదస్సుకు నారాయణపేట డీపీఆర్ఓ




నారాయణపేటజూలై 04 (వుదయం ప్రతినిధి) : జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్ వో) ఎం ఎ రషీద్ ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన మీడియా కమ్యూనికేషన్ అధికారుల జాతీయ సదస్సుకు హాజరయ్యారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోని IIIDEవీలో జరిగిన ఈ సదస్సులో మీడియా నిర్వహణ, ప్రజా కమ్యూనికేషన్, ఎన్నికల సమాచార ప్రచారంపై సాంకేతిక సెషన్లలో ఆయన పాల్గొన్నారు. ఈ జాతీయ సదస్సుకు తెలంగాణ నుంచి ఎంపికైన అధికారులలో రషీద్ ఒకరు.

# బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శులకు వీడ్కోలు



నాగిరెడ్డిపేట్,వుదయం నాగిరెడ్డిపేట్ మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శులకు ఘనంగా వీడ్కోలు పలికి, నూతనంగా వచ్చిన కార్యదర్శులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బదిలీ అయిన కార్యదర్శులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ సురేందర్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీఓ ప్రభాకర్ చారి, జూనియర్ అసిస్టెంట్ అరుణ్ కుమార్‌తో పాటు పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# దేవస్థానం భూములపై ఉక్కుపాదం

-- అక్రమ నిర్మాణాల తొలగింపులో రాజన్న ఆలయ యంత్రాంగం దూకుడు.
--భీమేశ్వర ఆలయ పరిధిలో ఆక్రమిత షెడ్డు కూల్చివేత





వేములవాడ, జూలై 4 టవుదయం ప్రతినిధిఈ: శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం ఆస్తుల పరిరక్షణలో భాగంగా ఆలయ అధికారులు మరోసారి అక్రమ ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపారు. శనివారం స్వామివారి అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ పరిధిలో దేవస్థానం స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన రేకుల షెడ్డును ల్యాండ్ ప్రొటెక్షన్ విభాగం అధికారులు తొలగించారు.భీమేశ్వర ఆలయం సమీపంలోని సులభ్ కాంప్లెక్స్ పక్కన దేవస్థానం భూమిని ఆక్రమించి దుకాణం నిర్వహిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ముందుగా పలుమార్లు నోటీసులు జారీ చేసి స్థలాన్ని స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని ఆదేశించారు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో చట్టబద్ధంగా చర్యలు చేపట్టి ఆక్రమిత నిర్మాణాన్ని పూర్తిగా తొలగించారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు మాట్లాడుతూ దేవస్థానం ఆస్తులు కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకలని, వాటి పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఆలయ భూములపై ఎలాంటి ఆక్రమణలను సహించబోమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా అక్రమ నిర్మాణాలపై నిరంతర ప్రత్యేక చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.దేవస్థానం, ప్రభుత్వ భూములపై ఎక్కడైనా ఆక్రమణలు కనిపిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని భక్తులు, స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ తొలగింపు కార్యక్రమంలో రాజన్న దేవాలయ ల్యాండ్ ప్రొటెక్షన్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చదువు మన తోడుంటే ఏదైనా సాధించవచ్చు

***విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థితి చేరుకోవాలి స్థానిక కౌన్సిలర్ లైశెట్టి రజిత రాజు***

మంథని, జులై 4: వుదయం ప్రతినిధి చదువు మన తోడుంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చని మంథని మున్సిపల్ కౌన్సిలర్ లైశెట్టి రజిత రాజు పేర్కొన్నారు. శనివారం మంథని పట్టణం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల(బాలురు)లో ఆరవ తరగతి విద్యార్థులకు స్థానిక కౌన్సిలర్ లైశెట్టి రజిత రాజు బోర్డు బహుకరించారు. పెద్దపెల్లి జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ సమన్వయ అధికారి, ప్రిన్సిపల్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్ రజిత రాజు బోర్డును విద్యార్థులకు బహుకరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రజిత రాజు మాట్లాడుతూ ... విద్యార్థులు కష్టపడి జీవితంలో పైకి రావాలని సూచించారు. గురువులు చెప్పిన మాటలు వింటూ పాఠశాలకు, తమ ప్రాంతానికి గొప్ప పేరు తీసుకురావాలని తెలిపారు. చదువు విలువ తెలుసు కాబట్టి విద్యార్థులకు ఎల్లప్పుడూ తమ సహకారం అందిస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల , శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సోషల్ వెల్ఫేర్ మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో గురుకులాలు అభివృద్ధి చెందుతున్నాయని వివరించారు. గురుకులంలో విద్యను ఎంతో చక్కగా అందిస్తున్నారని, ఇక్కడ వసతులు కూడా విద్యార్థులకు అద్భుతంగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులంతా బోర్డును బహుకరించినందుకు కౌన్సిలర్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# పంట మార్పిడి, ఆయిల్ పామ్ పంటల సాగును ప్రోత్సహించాలి

- కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా తగు చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.



ములుగు, జూలై 04 (వుదయం ప్రతినిధి) : పంట మార్పిడి విధానాలు, ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం పెంచేలా రైతులను అధికారులు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయం నుంచి సీఎస్ సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2026 - 27 సంవత్సరానికి 85 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. దీనికి అనుగుణంగా జిల్లాలలో అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. పంట మార్పిడి విధానాలను అవలంబించాలన్నారు. కూరగాయల సాగు వైపు దృష్టి సారించాలని వివరించారు. సూక్ష్మ సేద్య పద్ధతులు రైతులు పాటించేలా వారిని ప్రోత్సహించాలని తెలిపారు.

యూరియా, డిఎపి, ఇతర కాంప్లెక్స్ ఎరువులన్నీ రైతులకు సరిపడినన్ని అందించాలన్నారు.

ఎరువులను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల కలెక్టర్లు స్వయంగా ఈ అంశంపై పటిష్ట నిఘా ఉంచాలని వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

జిల్లాల వారీగా ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను సమీక్షిస్తూ, దేశంలోనే ఫార్మర్ రిజిస్ట్రీలో తెలంగాణ రాష్ట్రం 71.45 శాతంతో మొదటి స్థానంలో ఉందన్నారు.

వర్షాకాలం కాలానుగుణ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, తదితర వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డి ఎం హెచ్ ఓ గోపాల్ రావు, డీఈవో సిద్ధార్థ రెడ్డి, ఇరిగేషన్ ఈ ఈ అప్పలనాయుడు, మిషన్ భగీరథ డి ఈ సునీత సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అధికారులను రోడ్డుపైకి తీసుకురావడమేనా కాంగ్రెస్ మార్పు

**కమిషన్‌లపై శ్రద్ధ.. కార్మికుల సంక్షేమంపై నిర్లక్ష్యం**
**అధికారుల న్యాయమైన పోరాటానికి సంపూర్ణ మద్దతు: పుట్ట మధూకర్**




పెద్దపెల్లి, జూలై 4 (వుదయం కరస్పాండెంట్):కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఆశించిన మార్పు కనిపించడం లేదని, బయటకు రాని అధికారులను సైతం రోడ్డుపైకి వచ్చి నిరసనలు చేయాల్సిన పరిస్థితి తీసుకురావడమే కాంగ్రెస్ పాలనలో కనిపిస్తున్న మార్పని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు.రామగిరి మండలం సెంటినరీ కాలనీలో సింగరేణి ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఎదుట అధికారుల సమస్యల పరిష్కారం కోసం ఆరు రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలను టీబీజేకేఎస్ నాయకుడు మిర్యాల రాజిరెడ్డితో కలిసి సందర్శించి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి కార్మికులు, అధికారులు, రైతులు, విద్యార్థులు, మహిళల సంక్షేమం కంటే కమిషన్‌లపైనే ఎక్కువ ఆసక్తి ఉందని విమర్శించారు. సింగరేణి సంస్థ బలోపేతం అయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని భావించే వేలాది మంది కార్మికులు, అధికారులు నేడు తమ హక్కుల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.కోల్ ఇండియాలో అమలవుతున్న విధానాలు సింగరేణిలో కూడా అమలు చేయాలని అధికారులు కోరడం న్యాయమైన డిమాండ్ అని పేర్కొన్నారు. పీఆర్పీ అమలు కోసం పెద్ద మొత్తంలో నిధులు అవసరం లేదని అధికారులే చెబుతున్నప్పటికీ, ప్రభుత్వం సమస్య పరిష్కారంపై చొరవ చూపడం లేదని ఆరోపించారు.సింగరేణి మంత్రిగా ఉన్న భట్టి విక్రమార్క అధికారులతో చర్చిస్తామని చెప్పి ఇప్పటి వరకు స్పందించకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు తప్ప మిగతా వర్గాల ప్రజలు సంతృప్తిగా లేరని, రైతులు, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వ్యాఖ్యానించారు.సింగరేణి నిధులను కార్మికులు, అధికారుల సంక్షేమానికి వినియోగించాల్సిన అవసరం ఉందని, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అధికారుల న్యాయమైన పోరాటానికి టీబీజేకేఎస్, తాము పూర్తి మద్దతుగా ఉంటామని, డిమాండ్లు నెరవేరే వరకు అండగా నిలుస్తామని పుట్ట మధూకర్ భరోసా ఇచ్చారు.

# ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ వ్యసనంతో మహిళను కిడ్నాప్ చేసి దోపిడీ, హత్యాయత్నం చేసిన నిందితుడు అరెస్ట్

**సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించిన కరీంనగర్ పోలీసులు**






కరీంనగర్ జులై 04 (వుదయం ప్రతినిధి): ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌లో భారీగా డబ్బులు నష్టపోయి, అప్పుల ఒత్తిడితో మహిళను కిడ్నాప్ చేసి, బంగారు ఆభరణాలు దోచుకుని హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని కరీంనగర్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. కరీంనగర్ టవర్ సర్కిల్ సమీపంలోని లేబర్ అడ్డా వద్ద కూలీ పనికి వేచి ఉన్న గంగాధర లక్ష్మి (55) అనే మహిళ అదృశ్యమైన ఘటనపై తొలుత కరీంనగర్-3 టౌన్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తులో మహిళను కిడ్నాప్ చేసి దోపిడీ చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు తేలడంతో కేసును కరీంనగర్-1 టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో గొల్లపల్లి గ్రామానికి చెందిన ధమ్మ దినేష్ రెడ్డి (21), డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఈ నేరానికి పాల్పడినట్లు గుర్తించారు. నిందితుడు డి యు విన్,జియో లాటరీ వంటి ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్, కలర్ ట్రేడింగ్ గేమ్స్‌కు బానిసై సుమారు రూ.4 లక్షలు నష్టపోయాడు. అదనంగా పలు లోన్ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకుని వసూళ్ల ఒత్తిడిని ఎదుర్కొంటుండటంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ నేరానికి పథకం రచించాడు.నేరానికి వారం రోజుల ముందే నగరంలోని పలు ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించిన నిందితుడు, జులై ఒకటవ తేదీన టవర్ సర్కిల్ లేబర్ అడ్డా వద్ద ఒంటరిగా ఉన్న బాధితురాలిని లక్ష్యంగా ఎంచుకున్నాడు. ర్యాపిడో బైక్‌ను బుక్ చేసి బాధితురాలిని తిమ్మాపూర్ వైపు తీసుకెళ్లి, అనంతరం నుస్తులాపూర్ గ్రామ శివారులో పొలాల వైపు తీసుకెళ్లాడు. అక్కడ బాధితురాలిపై దాడి చేసి ఆమె వద్ద ఉన్న బంగారు పుస్తెలు రెండు, ఐదు బంగారు గుండ్లు, ఒక బంగారు చెవిపోగు (అన్నీ కలిపి ఐదు గ్రాములు), 20 గ్రాముల వెండి మట్టెలను దోచుకున్నాడు.అనంతరం తన నేరాన్ని దాచిపెట్టే ఉద్దేశంతో బాధితురాలిని వ్యవసాయ బావిలోకి తోసివేశాడు. బాధితురాలు బావిలో ఉన్న తాడును పట్టుకుని ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రయత్నించగా, ఆమె ఎట్టి పరిస్థితుల్లోనూ బ్రతకకూడదనే ఉద్దేశంతో, బ్రతికితే తనను గుర్తించే అవకాశం ఉందని భావించి, ఆమె పట్టుకున్న తాడును కూడా కత్తిరించి అక్కడి నుంచి పరారయ్యాడు. అయితే బాధితురాలికి ఈత రావడంతో బావిలో ఉన్న మోటార్ పైపులకు కట్టిన మరో తాడును పట్టుకుని రాత్రంతా బావిలోనే ప్రాణభయంతో గడిపింది. మరుసటి రోజు ఉదయం పొలం వద్దకు వచ్చిన రైతులు ఆమె కేకలు విని తాళ్లు, మంచం సహాయంతో బయటకు తీసి రక్షించారు. అనంతరం ఆమెను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, కరీంనగర్‌కు తరలించి చికిత్స అందించారు.

కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరా ఫుటేజ్, సెల్‌ఫోన్ విశ్లేషణ, ఫీల్డ్ ఇన్వెస్టిగేషన్ ఆధారంగా నిందితుడిని మార్కెట్ సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించాడు.

నిందితుడి వద్ద నుంచి నిందితుడి మొబైల్ ఫోన్, బాధితురాలి మొబైల్ ఫోన్, నేరానికి ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను, రూ.5,000 నగదు, బాధితురాలి 20 గ్రాముల వెండి మెట్టెలను పోలీస్ వారు స్వాధీనం చేసుకున్నారు. దోచుకున్న బంగారు ఆభరణాలను కరీంనగర్ టవర్ సర్కిల్‌లోని ఓ నగల వ్యాపారి అయిన వెనుమనోహర చారికి కి విక్రయించి రూ.30,000 పొందినట్లు విచారణలో వెల్లడైంది. నగల వ్యాపారి నుండి అట్టి సొమ్మును రికవరీ చేయడం జరిగింది. అలాగే కూలీ పనుల కోసం లేబర్ అడ్డాల వద్ద వేచి ఉండే అమాయకులను లక్ష్యంగా చేసుకుని కొందరు నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇటీవల ఇదే తరహాలో కూలీ పనికి తీసుకెళ్తామని చెప్పి ఒక వ్యక్తిని గదిలో నిర్బంధించి దాడి చేసి నగదు దోచుకున్న కేసును కూడా కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు ఛేదించిన విషయాన్ని గుర్తు చేశారు.కూలీలు అపరిచిత వ్యక్తులను నమ్మి ఒంటరిగా వెళ్లవద్దని, పనికి తీసుకెళ్లే వ్యక్తుల వివరాలు, వాహనం నంబర్, గమ్యస్థానం వంటి సమాచారాన్ని తప్పనిసరిగా కుటుంబ సభ్యులకు లేదా తోటి కూలీలకు తెలియజేసి వెళ్లాలని సూచించారు. ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కేసును అత్యంత చాకచక్యంగా, సాంకేతిక ఆధారాలతో ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్ కె. రామచందర్ రావు, ఇన్స్పెక్టర్ తిరుమల్, ఎస్సైలు సుమన్, చేరాలు, భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ జ్ఞానేశ్వర్, పోలీస్ కానిస్టేబుళ్లు లక్ష్మీపతి, రాజ్‌కుమార్, ప్రశాంత్‌లను పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.



# జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ డ పీజీ కళాశాలలో డిగ్రీ దూరవిద్యలో ప్రవేశాలు

జమ్మికుంట, జులై 4 (వుదయం ప్రతినిధి):కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీడ పీజీ కళాశాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ దూరవిద్యలో బీఏ,బీకాం, బీఎస్సీ కోర్సులలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల అయిందని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎస్ ఓ కుమార్,కోఆర్డినేటర్ డాక్టర్ కే రాజేంద్రం లు తెలిపారు.

ఈ ప్రవేశాలకు చివరి తేదీ 07.08.2026 లోగా దరఖాస్తు చేసుకోగలరని అన్నారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న వారు ట్యూషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. విద్యార్థులు సమాచారం కొరకు 7382929775 నెంబర్ను సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పంట మార్పిడి.. ఆయిల్ పామ్ సాగు విస్తరించాలి

- కాలానుగుణ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు.
-ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశం.



రాజన్న సిరిసిల్ల, జూలై 4 టవుదయం ప్రతినిధిఈ : రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇస్తూ పంట మార్పిడి విధానాలను విస్తృతంగా అమలు చేయాలని, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు రైతులను చైతన్యపరచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వ్యవసాయం, ఎరువుల లభ్యత, ఫార్మర్ రిజిస్ట్రీ, వర్షాకాల వ్యాధుల నివారణపై సమీక్షించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. 2026--27 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా నిర్దేశించినట్లు సీఎస్ తెలిపారు. జిల్లాల వారీగా కార్యాచరణ రూపొందించి లక్ష్యాలను సాధించాలని, పంట మార్పిడితో పాటు కూరగాయల సాగు, సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు యూరియా, డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉండేలా చూడాలని, ఎరువుల అక్రమ రవాణా, పక్కదారి పట్టింపును కఠినంగా అరికట్టాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును వేగవంతం చేయాలని, దేశవ్యాప్తంగా తెలంగాణ 71.45 శాతం నమోదుతో తొలి స్థానంలో ఉందని పేర్కొంటూ అదే వేగాన్ని కొనసాగించాలని సూచించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పారిశుధ్యం, దోమల నివారణ, తాగునీటి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖితతో పాటు వ్యవసాయ, ఉద్యానవన, వైద్య ఆరోగ్య, పౌర సరఫరాలు, పశుసంవర్ధక, పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు ఘన నివాళి



కరీంనగర్, జూలై 04 (వుదయం ప్రతినిధి):ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఆర్థిక వ్యవహారాల్లో అపార అనుభవం కలిగిన స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆ మహనీయుడికి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రజాసేవలు, రాజకీయ జీవితం, పరిపాలనా దక్షతను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య నిరాడంబర జీవనశైలితో, నిజాయితీతో ప్రజలకు సేవలు అందించి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రిగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సమర్థంగా నిర్వహించిన ఆయన, ముఖ్యమంత్రిగా ప్రజా సంక్షేమం, పరిపాలనలో పారదర్శకతకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. రాజకీయాల్లో విలువలు, క్రమశిక్షణ, నిబద్ధతకు ఆయన నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొని రోశయ్యకు ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో స్వామి ఆర్డీవోలు షర్మిల, జల కుమారి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీరామ్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్ ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు కన్న కృష్ణ, మునీందర్ ఆర్యవైశ్య సంఘాల నాయకులు పలువురు అధికారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.